వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 245
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
జూన్ 30, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


2లో..

# పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- మలక్కపేట సాంఘిక సంక్షేమ గురుకులంలో ఘటన
- బంధువుల ఆందోళన



- 56 మంది విద్యార్థులను చేర్పించిన టీచర్లు
- జిల్లా అధికారుల ప్రశంసలు

2లో..




# బడిని బతికించారు !

వివరాలు8లో..




# నవశకానికి నాంది

- డిజిటల్ ప్రింట్ మీడియా ఎడిటర్స్ సంఘానికి శ్రీకారం
- సమస్యలపై సంఘటితంగా పోరాడుదాం అంటూ ప్రతిన
- అస్తిత్వాన్ని తొక్కాలని చూస్తే ఊరుకోం అంటూ హెచ్చరిక
- వరంగల్ కేంద్రంగా నూతన కమిటీ ఆవిర్భావం
- అధ్యక్షుడిగా గడ్డం కేశవ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్ రావు



# విరోధిని క్రమంలో అమ్మవారు

- ఐదో రోజుకు చేరుకున్న శాకంభరి ఉత్సవాలు

నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవస్థానంలో శాకంభరి నవరాత్ర మహోత్సవాలు సోమవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి 'విరోధిని' గాను షోడశీ క్రమాన్ని అనుసరించి 'వహ్నివాసిని' గాను అంకరించి ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూజారాధనలు నిర్వహించారు. ఆలయానికి పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు మంచినీటి వసతి, ప్రసాద వితరణ తదితర ఏర్పాట్లు ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, నార్ల సుగుణలతో కలిసి ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

– వరంగల్ వాయిస్, వరంగల్


8లో..

# కేంద్రంపై ఒత్తిడి తెద్దాం

- కోచ్ ఫ్యాక్టరీని సాధించుకుందాం..
- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం భాస్కర్

# 4న నగరానికి రానున్న ఖర్గే

గ్రామ స్థాయి నేతలతో బహిరంగ సమావేశం | పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి


2లో..



# పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మండలంలోని మలక్కపేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లో పదో తరగతి చదువుతున్న ఏకు శ్రావణి (15) ఆత్మహత్యకు పాల్పడింది. సంవత్సరాలు టెన్త్ క్లాస్ చదువుతుంది ఈరోజు మధ్యాహ్నం భోజన సమయంలో వాష్ రూమ్ కు వెళ్లిన శ్రావణి అక్కడే చున్నితో ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న గురుకులం సిబ్బంది విద్యార్థినిని హుటాహుటిన పరకాల గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. అయితే శ్రావణి మృతదేహాన్ని హాస్టల్ నుంచి తరలించిన తర్వాత సోషల్ వెల్ఫేర్ సిబ్బంది శ్రావణి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అమ్మాయి హాస్టల్ లో జారిపడిందని, హాస్పిటల్ కు తరలించామని, అక్కడికి రావాలంటూ సమాచారం ఇచ్చినట్లు శ్రావణి తల్లిదండ్రులు ఆరోపించారు. హుటాహుటిని హాస్పిటల్ కు చేరుకున్న విద్యార్థిని తల్లదండ్రులు, బంధువులు శ్రావణి మృతదేహాన్ని ఒక్క సారిగా తల్లడిల్లిపోయారు. ఆమె మృతిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఐదో తరగతి నుంచి ఇదే రెసిడెన్షియల్ లో చదువుతున్న శ్రావణి మృతిపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు. అందరితో సన్నిహితంగా ఉండే ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదన్నారు. దీనిపై నిజానిజాలు తెలుసుకునేందుకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్ కు వెళ్లగా వారిని లోనికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. గేటు బయటే అందరినీ నిలిపివేశారు. దీంతో పోలీసులకు, విద్యార్థిని బంధువులకు మధ్య వాగ్వాదం జరిగింది. కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మీడియాను సైతం లోనికి రాకుండా స్థానిక సీఐ క్రాంతికుమార్ అడ్డుకోవడంతో శ్రావణి బంధువుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో గేటు ముందే బైఠాయించి ఆందోలన చేశారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న ఏసీపీ సతీష్ బాబు హాస్టల్ వద్ద ఎవరు గొడవ చేయొద్దంటూ సూచించారు. ఆందోళన చేస్తే మిగతా విద్యార్థినులు భయపడతారంటూ వారికి సర్ది చెప్పారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాత తప్పకుండా న్యాయం చేస్తామని ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఘటనకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో పరకాల తాసిల్దార్ తోట విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో స్థానిక సీఐ క్రాంతి కుమార్ విచారణ నిర్వహించారు. పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.



# బడిని బతికించారు!

- 56 మంది విద్యార్థులను చేర్పించిన టీచర్లు
- జిల్లా అధికారుల ప్రశంసలు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల జోరు కొనసాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణతో విద్యాశాఖలో గణనీయమైన మార్పులు జరుగుతున్నాయి. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోపాటు టీచర్ల ప్రమోషన్లు, బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయడం, నూతన ఉత్సాహంతో నిర్వహించిన 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన వారం రోజుల్లోనే వందల సంఖ్యలో కొత్త అడ్మిషన్లు నమోదయ్యాయి. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల వలస పెరుగుతుండటం గమనార్హం.

**ఏఐ పాఠాలు..**

ఈ నెల 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాగా, అడ్మిషన్ల పెంపునకు ఈ నెల 6 నుంచి 'బడిబాట' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. టీచర్లు, గ్రామస్తుల కృషితో ప్రైవేటు బడుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల చేరిక మొదలైంది. ఇది ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరుగుతున్నట్లు స్పష్టం చేస్తోంది. మరోవైపు, టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ వంటి సంఘాలు ప్రత్యేకంగా ర్యాలీలు నిర్వహించి గ్రామాల్లో తల్లిదండ్రులను చైతన్యపరచడంలో కీలక పాత్ర పోషించాయి. సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చడం, 1.10 లక్షల మంది టీచర్లకు ఐదు రోజులపాటు శిక్షణ ఇవ్వడం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ తరగతులు, చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం కొన్ని పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహకారంతో పాఠాలు బోధించడం వంటివి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అంతేకాకుండా, పాఠశాలలు తెరిచిన రోజే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్ అందజేశారు.

**దాన్య తండాలో విజయం..**

డోర్నకల్ మండలంలోని దాన్య తండా ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది జరిగిన బడిబాట కార్యక్రమం అద్భుత ఫలితాలనిచ్చింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజపుత్ర అజయ్ సింగ్ తో పాటు టీచర్లు సుజాత, రాజేశ్వర్లు గత సంవత్సరం ప్రమోషన్లు, బదిలీలపై ఇక్కడికి వచ్చారు. వీరు ప్రతి ఇంటిని సందర్శించి గ్రామంలోని విద్యార్థుల వివరాలు సేకరించారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలను కలిసి తమ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించవలసిందిగా కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం, వారానికి మూడుసార్లు కోడిగుడ్లు, మూడుసార్లు రాగి జావా, ప్రతినెలా ఉచితంగా విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు వంటి కార్యక్రమాలను వారికి వివరించారు. కాంప్లెక్స్ సమావేశాలు, టీఎల్ఎం మేళా, డాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి సొంత ఖర్చులతో చికెన్‌తో కూడిన భోజనాలు ఏర్పాటు చేశారు. ఐదో తరగతి పూర్తి అయిన విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు, పాఠశాలలో జరిగే అన్ని కార్యక్రమాలకు గ్రామ పెద్దలను భాగస్వాములను చేశారు. ప్రతినెల పీటీఎం సమావేశాలు నిర్వహించి పాఠశాలపై గ్రామస్తులకు నమ్మకం కలిగించారు.

**కొత్తగా 56 మంది విద్యార్థులు..**

బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించి, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. గ్రామస్తులందరితో తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో పంపుతామని హామీ తీసుకున్నారు. గతంలో గ్రామం నుంచి దాదాపు 60 మంది విద్యార్థులు బస్సుల్లో ఇతర ప్రైవేటు పాఠశాలలకు వెళ్లేవారు. అయితే, ఇక్కడి ఉపాధ్యాయుల కృషితో గతంలో 26 మంది విద్యార్థులు మాత్రమే ఉన్న ఈ పాఠశాల, నేడు 82 మంది విద్యార్థులతో (ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 56 మందిని కొత్తగా చేర్చడం జరిగింది) ఉచిత విద్యాబోధనను అందిస్తోంది. గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో ఈ విజయం సాధించడం గర్వకారణం. ప్రస్తుతం గ్రామానికి వస్తున్న ప్రైవేటు పాఠశాల బస్సులు ఖాళీగా వెళుతున్నాయి. జిల్లా అధికారులు ఈ పాఠశాలను ప్రశంసించారు.

### విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..

**- రాజపుత్ర అజయ్ సింగ్,**
**ప్రధానోపాధ్యాయులు, ధాన్యతండా, డోర్నకల్**



విద్యార్థులు స్కూల్‌కు వచ్చిన నాటి నుంచి వారి చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాం. అధికంగా గిరిజన విద్యార్థులు ఉండే ఈ తండాల్లో విద్యార్థులు చదువుకు దూరం కావద్దనే సంకల్పంతో పాఠశాలకు తిరిగి జీవం పోశాం. ముఖ్యంగా క్రమం తప్పకుండా బడికి వచ్చి పాఠాలు చెప్పి, గురు బాధ్యత నెరవేరుస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించి బోధన చేపడుతున్నాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయం సాధించాం. ప్రస్తుతం విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను పొందుతూనే మంచి విద్యను అందుకుంటున్నారు. ఐదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, వారికి ఏకలవ్య గురుకులం వంటి పాఠశాలల్లో ప్రవేశం పొందే విధంగా తీర్చిదిద్దాం. పాఠశాలలో చదువులు మాత్రమే కాకుండా ఆటలు, సంవత్సరానికి ఒకసారి విద్యా పర్యటనలు కూడా తీసుకెళ్తున్నాం.

# 4న నగరానికి రానున్న ఖర్గే

- గ్రామ స్థాయి నేతలతో బహిరంగ సమావేశం
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జూలై 4 న గ్రామ స్థాయి నేతలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగారాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ పార్లమెంట్, అసెంబ్లీ నియోజవర్గాలకు ఇంచార్జులుగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శిలు దుద్దిళ్ల శ్రీను బాబు, పల్లె శ్రీనివాస్ గౌడ్, మోత్కూరి ధర్మారావులతో కలిసి ఎమ్మెల్యే నాయిని సోమవారం హనుమకొండ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి కార్యకర్తలతో నేరుగా మాట్లాడాలనే ఆలోచనతో నిర్వహించ తలపెట్టిన ఖర్గే సభను విజయవంతం చేయాలని కోరారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి



నియోజవర్గం నుంచి అధిక సంఖ్యలో క్షేత్ర స్థాయి కార్యకర్తలను తరలిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధికి సహరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వంపై తమ అక్కసును వెళ్లగక్కడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి కడుతున్న నిధులలో మా రాష్ట్ర వాటా మనకు ఇవ్వకుండా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, మిత్ర పక్ష రాష్ట్రాల్లో అధిక నిధులు కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపడం పట్ల ధ్వజమెత్తారు. రెండో దశ మెట్రో, త్రిపుల్ ఆర్, మూసి నది ప్రక్షాళనకు కేంద్రం నిధులు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలోనూ సంక్షేమం మరువలేదు

◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఆర్థిక సంక్షోభం, అస్థిరతల మధ్య కూడా సంక్షేమ పథకాలను నిలకడగా అమలు చేస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ప్రజా సంకల్పానికి నిదర్శనంగా నిలిచింది. వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 800 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నగర్ మేయర్ గుండు సుధారాణి, నగర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ "గత పాలకుల బాధ్యతారాహిత్య పాలన వల్ల ఆర్థికంగా దెబ్బతిన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో మాత్రం ఎక్కడా తడబడలేదు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి పేద కుటుంబానికి మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 ఇళ్లను కేటాయించిందని, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కఠినమైనదైనప్పటికీ ఇప్పటివరకు 2,000 మంది లబ్ధిదారులను గుర్తించామని ఆయన తెలిపారు. మిగిలిన అర్హులు తమ వివరాలతో ప్రజాప్రతినిధులను లేదా సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, గతంలో ఎన్నో దఫాలుగా చేసిన ప్రయత్నాలు ఫలించినందుకు ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు ద్వారా తమ కుటుంబానికి గౌరవప్రదమైన జీవితం ప్రారంభమవుతోందని పేర్కొన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, పార్టీ నాయకులు, లబ్ధిదారులుపాల్గొన్నారు.

# విశ్వ శాంతి, విశ్వ కళ్యాణం విశ్వహిందూ పరిషత్ లక్ష్యం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా ప్రముఖులు రఘునాథపల్లి మండలాన్ని సోమవారం ఉదయం సందర్శించారు. ఈ పర్యటనలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ, సహాయ కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, పట్టణ ఉపాధ్యక్షులు తాడూరి సంతోష్ రాజ్, కాసర్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో పర్యటించిన వీరు పలువురు ఆధ్యాత్మిక, ధార్మిక ప్రముఖులను, సామాజిక కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ రఘునాథపల్లి మండలంలోని ప్రతీ గ్రామంలోనూ విశ్వహిందూ పరిషత్ కార్యవర్గాలను నియమించాలని పిలుపునిచ్చారు. అలాగే భజరంగ్ దళ్, మాతృమండలి, దుర్గావాహిని, గోరక్ష, దేవాలయ రక్షణ వంటి కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా సంఘటిత హిందూ సమాజాన్ని నిర్మించవచ్చని, విశ్వ శాంతి, విశ్వ కళ్యాణం విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని అన్నారు. ఈ లక్ష్యాల సాధన కోసం హిందువులందరూ చేయి చేయి కలిపి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం చైతన్యవంతమైన హిందూ సమాజం ముందుకు రావాలని, విశ్వహిందూ పరిషత్ లో చేరాలని కోరారు. ఈ సమావేశంలో పడకంటి రవీందర్, ఎల్. కిషన్ రావ్, చింతకింది కృష్ణమూర్తి, జి. సత్యనారాయణ, వల్లాల శివ, ఎమ్. జంపయ్య, పోకల హరిప్రసాద్, అంబటి బాలరాజు, మంతన ఉప్పలయ్య, మిట్టపల్లి రోహిత్, మంతన ఉప్పలయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జులై 1న ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతోత్సవాలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపాధ్యక్షుడు ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతోత్సవాలను ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి కమిటీ, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో కార్యక్రమాలు జరుగుతాయి. ప్రారంభ సభలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు వెలుదండ నిత్యానందరావు, సాహితీవేత్తలు ఎం. శంకర్ రెడ్డి, కసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని దొణప్ప రచించిన 'వ్యాసభారతి' గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బిట్టు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరుగనున్న సదస్సులో 'దొణప్ప జీవితం – వ్యక్తిత్వం' అనే అంశంపై కవి శంకరనారాయణ, 'ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణ' అనే అంశంపై ఆచార్య భమిడిపాటి విశ్వనాథం, 'భాషా చారిత్రక వ్యాసావళి' అనే అంశంపై ఆచార్య అయినవోలు ఉషాదేవి ప్రసంగిస్తారు. అలాగే, విశ్రాంత ఆచార్యులు చిగిచర్ల కృష్ణారెడ్డి అధ్యక్షతన జరుగనున్న రెండవ సదస్సులో 'తెలుగు హరికథ సర్వస్వం' అనే అంశంపై ఆచార్య పులికొండ సుబ్బారావు ప్రసంగిస్తారు. కాబట్టి, జిల్లా కవులు, సాహితీవేత్తలు, అధ్యాపకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా నిర్వాహకులు కోరారు.

# లయన్స్ క్లబ్ మిలీనియం అధ్యక్షుడిగా బండ భిక్షపతి

● ఘనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం



**వరంగల్ వాయిస్, జనగామ :** లయన్స్ క్లబ్ అఫ్ జనగామ మిలీనియం చార్టర్ నైట్, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం స్థానిక కెమిస్ట్ భవన్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు గాదె నరసింహులు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా లయన్స్ జిల్లా 320 ఎఫ్ గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడారు. క్లబ్ లో నూతన సభ్యులను, మహిళా సభ్యులను ఇతోధికంగా చేర్పించి వారిని కూడా సేవాకార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని అన్నారు. మొదటి జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేశారు. రెండవ జిల్లా వైస్ గవర్నర్ ఎన్.సుధాకర్ రెడ్డి క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా బండ భిక్షపతి, కార్యదర్శిగా కాముని వెంకట ప్రసాద్, కోశాధికారిగా దాసరి సుమన్ తో పాటు పూర్తి కార్యవర్గం ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ జిల్లా గవర్నర్ ఎలెక్ట్ పి.హరికిషన్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వి.వేణుగోపాల్ రెడ్డి, రీజియన్ చైర్మన్లు చందుపట్ల రవీందర్ రెడ్డి, రాముని శ్రీనివాసులు, జోన్ ఛైర్మెన్ రంగరాజు ప్రవీణ్ కుమార్, బైరు వెంకటేశ్వర్లు, పూర్వ రీజియన్ చైర్మన్లు కుర్రెముల యాదగిరి, ఏనుగు నర్సి రెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, దోర్నాల వెంకటేశ్వర్లు, పూర్వ జోన్ ఛైర్మెన్ లు కర్రే కృష్ణ, జి. బిక్షపతి, ఇ, నరేందర్, క్లబ్ పూర్వ అధ్యక్షులు మినుగొండ అశోక్ కుమార్, కడకంచి మధుసూదన్, మినుకూరి మహేందర్ రెడ్డి, నాయకులు శారదా దేవి, అజిత్ . కృష్ణ జీవ బజాజ్, వెంకట్ రమణ రెడ్డి, యాట వెంకటేష్, ,కోడం శ్రీనివాస్, బొంతపల్లి నాగరాజు, మేడ పూర్ణ చందర్, మహిళలు పాల్గొన్నారు.

# నేర ప్రవృత్తి మార్చుకోకపోతే చర్యలు

## టౌన్ ఇన్ స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నేరాలకు పాల్పడుతూ సస్పెక్ట్ షీట్స్ కలిగిన పలువురు నిందితులకు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షింది లేదని స్పష్టం చేశారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా తమ ప్రవర్తన మార్చుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానితుల కదలికలను పోలీస్ శాఖ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ఎస్ఐలు శివ, విజయ్ కుమార్, సూరయ్యలు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై తేల్చండి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఎప్పుడు ఒత్తిడి చేస్తుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి, రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చకుండా ఎలా అమలు చేస్తారని ఆయన నిలదీశారు. శాసనసభ, శాసనమండలిలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బిల్లులు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి నెలలు గడుస్తున్నా కేంద్రం స్పందించకపోవడం దుర్మార్గమని వెంకట్రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బీసీ సంఘాల నేతలతో అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామన్న ముఖ్యమంత్రి మాట మరిచారా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్రంలోని బీజేపీ మంత్రులు, ఎంపీలు మౌనవ్రతం వీడి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించకపోతే తగిన గుణపాఠం తప్పదని వెంకట్రాములు హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# ఎంఏ తెలుగు ప్రవేశాలకు జూలై 7వరకు గడువు పొడిగింపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ హంటర్ రోడ్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2025–2026 సంవత్సరానికి ఆలస్య రుసుముతో ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రవేశానికి గత సోమవారం గడువు ముగిసింది. కాగా విద్యార్థుల విజ్ఞప్తుల మేరకు ఆలస్య రుసుముతో జూలై 7వరకు గడువు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయని పేర్కొన్నారు. వివరాల కోసం 99891 39136, 99894 17299 సెల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

# రేపటి నుంచి ఎంఏ తెలుగు మూడో సెమిస్టర్ తరగతులు ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ హంటర్ రోడ్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2024–2025 సంవత్సరానికి సెకండ్ ఇయర్ ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు మూడో సెమిస్టర్ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తరగతులకు తప్పక హాజరుకావాలసిందిగా సూచించారు.

# కస్తూర్బాలో టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** పర్వతగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంఎల్ టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) గ్రూప్‌లో సబ్జెక్టు బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ నాజీయా సల్మా మాట్లాడుతూ, ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్య ఒకటి అని వెల్లడించారు. దరఖాస్తు చేసుకోబోయే అభ్యర్థికి కింది అర్హతలలో ఏదో ఒకటి తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఎండీ పాథాలజీ/ మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ/డీపీపీ, ఎంఎస్సీ మైక్రోబయాలజీ/ బయోకెమిస్ట్రీ/ ఎంఎల్ టీ, బీ ఫార్మసీ/ఎమ్మెస్సీ జెనెటిక్స్, ఎంబీబీఎస్/ ఎంబీబీఎస్(హోం) బీహెచ్ఎంఎస్, పీజీడీ క్లినికల్ బయో కెమిస్ట్రీ అర్హతలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 03-07-2025. ఆసక్తిగల అభ్యర్థులు నేరుగా కస్తూర్బా పాఠశాల, పర్వతగిరిలో తమ దరఖాస్తులను సమర్పించాలని ఆమె సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు



**వరంగల్ వాయిస్, దామెర :** పులుకుర్తి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల స్థలాల్లో సోమవారం కాంగ్రెస్ నాయకులు ముగ్గులు పోశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంద్రమ్మ కమిటీ మెంబర్స్ గన్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ బెల్లం వేణుగోపాల్, లింగాల రాజు, గోవింద రవికుమార్, టి. మహేందర్, కారోబార్ జి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారురాలు లింగాల సరోజన ఇంటి వద్ద ముగ్గు వేయడం జరిగింది.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను సత్కరించిన కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్ గ్రామంలోని ఏఎంఆర్ ఉన్నతశ్రేణి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి మాదిగ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో జరిగిన మాదిగ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల, వృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూర్ శాసనసభ్యుడు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామెల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ తమ మాదిగ జాతికి చెందిన అన్ని శాఖల అధికారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు, పాత్రికేయులు ఒకే వేదికపైకి వచ్చి కలుసుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మాదిగ జాతి బిడ్డలు ఐక్యతగా ఉంటే ఏదైనా సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన తర్వాత తొలిసారిగా జరగనున్న స్థానిక సంస్థల ఎంపీటీసీ, సర్పంచ్, జెడ్పీటీసీ, మున్సిపల్, సహకార సంఘాల ఎన్నికలలో అన్ని పార్టీలలో పనిచేస్తున్న మాదిగ జాతి బిడ్డలు కష్టపడి గెలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, శాయంపేట సర్పంచ్ ఆకనపల్లి సుజాత భద్రయ్య, నగరం గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కేయూలో చేపట్టొద్దు

● విద్యార్థి సంఘాల ధర్నా



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ యూనివర్సిటీకి చెందిన భూములను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కోసం కేటాయిస్తూ యూనివర్సిటీ పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల బాధ్యులు ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మచ్చ మహేష్, బీఆర్ఎస్వీ యూనివర్సిటీ ఇంచార్జి జెట్టి రాజేందర్, పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జయసూర్య, బీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు శివ, ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షులు మధు, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సాయి మాట్లాడుతూ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి యూనివర్సిటీ భూములను కేటాయించడానికి పాలకమండలి ఆమోదించిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 17న యూనివర్సిటీ భూములను ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్ ఆమోదించిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని యూనివర్సిటీ భూములను పరిరక్షించాలనీ, లేకుంటేవిద్యార్థి సంఘాలు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస సావిత్రి, డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అజయ్, బీఆర్ఎస్వీ నాయకులు పస్తం అనిల్, కొత్తూరు రోహిత్, పాలబోయిన రాజు, జువాజీ, శ్రీజిత్ మాట్లాడిన అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి కట్ల రాజేందర్ కు అందించారు. విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు.

# సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యం



◆ సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో పాలకవర్గాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలను తీవ్రతరం చేస్తూ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలివ్వాలి సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. సోమవారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ ఉత్తర మండల 2వ మహాసభ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరగగా సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి హాజరై మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అదే విధంగా హనుమకొండ మండలంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, నాయకులు దామెర సుదర్శన్, అలువాల రాజు, రాముగోపాల్ చారి, జూకంటి పద్మ, రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

**నూతన హనుమకొండ ఉత్తర మండల సమితి ఎన్నిక..**

హనుమకొండ ఉత్తర మండల సమితి 25 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. హనుమకొండ ఉత్తర మండల సమితి కార్యదర్శిగా ఎన్ ఎ స్టాలిన్, సహాయ కార్యదర్శులుగా గుంటి రాజేందర్, దామెర సుదర్శన్, కోశాధికారిగా అలువాల రాజులతో పాటు 25 మంది కౌన్సిల్ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమ్మె నోటీసు



**వరంగల్ వాయిస్, అసిఫాబాద్ :** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, నాలుగో తరగతి ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ ఉద్యోగులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ఇవ్వాలని ఎన్ హెచ్ఎం ఉద్యోగం సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 09న చేపట్టనున్న సారంత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును సూపర్వైజర్ శారద కు ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆసిఫాబాద్ జిల్లా ఉద్యోగులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎంలు మంజుల, సునీత, బుజ్జి ,మేఘన, స్వరూప ,భాగ్య, కాంటిజెంట్ వర్కర్స్ ముస్తాక్ హుస్సేన్, మాయ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

◆ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్



**వరంగల్ వాయిస్, మల్హర్:** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్లలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శాంతియుత దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చకుండా జాప్యం చేయడం దారుణమన్నారు. రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల కాలం పాటు తమ వృత్తులను, వ్యాపారాలను పక్కన పెట్టి నేడు ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయి అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. . ఈ శాంతియుత దీక్షా శిబిరానికి బీజేపీ మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్ రావు హాజరై ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలోజు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, మండల అధ్యక్షులు బూడిద సతీష్, ప్రధాన కార్యదర్శి బండారి శంకరయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్ పాషా, బడితెల వెంకటస్వామి, కోండ్ర సారయ్య, చొప్పరి రాజు, సభాపత్ నాగరాజు నాయక్, ముద్రవేణి కిష్టయ్య, గడ్డం సమ్మక్క, బండారి యశోద, జునగరి పద్మ, అక్కల రాజేశ్వరి, మద్దెల విజయ, మీనుగు నాగేష్, తోకల గట్టయ్య, ఆకుల సదానందం, రేకుంట్ల గోవర్ధన్, చల్ల మొండి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సేవలు అభినందనీయం

◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, గణపురం:** టీజీఎస్ఆర్టీసీలో ఉద్యోగం చేయడం చాలా శ్రమతో కూడుకున్నదని, ప్రతీ ఉద్యోగి సంస్థ అభివృద్ధి కోసం విధుల్లో చేరినప్పటి నుంచి అహర్నిశలు కృషి చేస్తారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం కర్కపల్లి గ్రామానికి చెందిన అంబాల సాంబయ్య గత 28 ఏళ్లుగా టీజీఎస్ఆర్టీసీలో బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. ఈరోజు భూపాలపల్లిలోని ఆర్టీసీ డిపోలో జరిగిన ఆయన సన్మాన మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ముందుగా సాంబయ్య దంపతులకు ఎమ్మెల్యే పూలమాల వేసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గణపురం మండలం కర్కపల్లి గ్రామానికి చెందిన సాంబయ్య గత 28 ఏళ్లుగా ఆర్టీసీలో బస్సు డ్రైవర్‌గా పనిచేసి భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలతో పాటు అధికారులు, తోటి ఉద్యోగుల మన్ననలను పొందారని అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, అయితే ఇన్ని రోజులు ఎలాంటి సేవలందించారన్నది చాలా కాలం పాటు గుర్తుంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్టీసీలో సుదీర్ఘకాలం పాటు పనిచేయడం చాలా శ్రమతో కూడుకున్నదన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, డిపోలో పని చేసే ఇతర సిబ్బంది శారీరక శ్రమ అంతా ఇంతా కాదన్నారు. వీరంతా ప్రతి రోజు పని చేస్తేనే ఎన్నో వేల మంది తమ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుతారని గుర్తు చేశారు. ఈరోజు పదవీ విరమణ పొందుతున్న సాంబయ్య ఇన్ని రోజులు చాలా కష్టపడ్డారని, ఇక నుంచి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



## బుద్ధారంలో పర్యటించిన ఎమ్మెల్యే జీఎస్సార్..

భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం బుద్ధారం గ్రామంలో ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొత్తగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవనాలకు అవసరమైన స్థలాలను ఈడబ్ల్యూఐడీసీ డీఈ రామకృష్ణ, ఏఈ జీవన్ కుమార్, గ్రామ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. అదేవిధంగా, పాఠశాల ప్రహరీ గోడ పునరుద్ధరణ పనులు, పాఠశాల ప్రాంగణంలో ఓపెన్ జిమ్, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు విద్యార్థులకు ఇతర మౌలిక వసతుల కల్పనల కొరకు అధికారులతో చర్చించారు. ఈ అన్ని పనులకు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. బుద్ధారం గ్రామ బస్టాండ్ సెంటర్‌లో కొడవటంచ వెళ్లే దారిలో కొత్తగా నిర్మించనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆర్చి పనులకు సంబంధించి కూడా అధికారులతో చర్చించారు.

# గౌరవ డాక్టరేట్ అందుకున్న సాగంటి మంజుల



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జూన్ 28న (శనివారం) సాయంత్రం హైదరాబాద్‌లోని నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు (సురవరం ప్రతాపరెడ్డి) తెలుగు విశ్వవిద్యాలయంలో ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, ఢిల్లీ మరియు ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ, ఢిల్లీ సంయుక్తంగా హనుమకొండలోని గోపాలపురానికి చెందిన సామాజిక సేవకురాలు సాగంటి మంజులకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశాయి. ఆమె చేస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, ఒక మహిళగా ఇంటిని చక్కదిద్దడమే కాకుండా సమాజాన్ని కూడా తన కుటుంబంగా భావించి సేవ చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలవడం అభినందనీయమని కార్యక్రమ నిర్వాహకులు అన్నారు. అలాంటి మహిళకు డాక్టరేట్ ఇవ్వడం తమకు గర్వకారణమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ బాధ్యులు, స్ఫూర్తి అకాడమీ అధ్యక్షుడు ఆకుల రమేష్, మల్లం రమేష్, సినీ ప్రముఖులు, వందే భారత్ చిత్రం యూనిట్ అతిథులుగా పాల్గొన్నారు. ఉపాధ్యాయ విద్యా కళాశాల అధ్యాపకురాలిగా, కవయిత్రిగా, గాయకురాలిగా, సాగంటిస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్‌గా, జర్నలిస్ట్‌గా, సామాజిక వేత్తగా పలు రంగాల్లో రాణిస్తున్న మంజులకు డాక్టరేట్ రావడం పట్ల రెండు తెలుగు రాష్ట్రాల కవులు, చిత్రకళా రంగ ప్రముఖులు, సామాజిక సేవకులు హర్షం వ్యక్తం చేశారు.

# వైద్య కళాశాలకు మృతదేహం దానం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేత లింగంపల్లి దయానంద్ తన తండ్రి మృతదేహాన్ని వైద్య విద్యార్థులు ప్రయోగాలు చేసుకునేందుకు వీలుగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు దానం చేశారు. మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన భిక్షపతి గతంలోనే మరణానంతరం తన దేహాన్ని అప్పగిస్తున్నట్లు అంగీకార పత్రాన్ని అందించారు. భిక్షపతి ఆదివారం మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు భిక్షపతి మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించి వైద్య కళాశాలకు అందించారు. తన తండ్రి మృతదేహం సమాజానికి ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అందించారు.

# నూతన చట్టాలపై ఆందోళన



● ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జనగామ జిల్లా సమావేశం

**వరంగల్ వాయిస్, జనగామ:** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జనగామ జిల్లా సమావేశం సోమవారం జనగామ జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న అడ్వకేట్ గాజుల రవీందర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పార్థసారధి, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎదునూతల శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి మందడపు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. పార్థసారధి మాట్లాడుతూ దేశంలో నూతన చట్టాల వల్ల సామాన్య ప్రజలకే కాదు, దేశ ప్రజలందరికీ కూడా సత్వర న్యాయం అందడం లేదని విమర్శించారు. అన్యాయాన్ని ప్రశ్నించే వారిపై దేశద్రోహం కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు కొత్త లేబర్ చట్టాలు తీసుకొచ్చి 8 పని గంటలను 12 గంటలకు పెంచి ఉద్యోగులను, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. నూతన చట్టాలు వచ్చిన తర్వాత అడ్వకేట్లపై దాడులు ఎక్కువయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఐలు తరపున నూతన చట్టాల సవరణ, అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్, ఇన్సూరెన్స్, ఇంటి స్థలాలు తదితర సమస్యల పరిష్కారం కోసం పోరాటంతో పాటు, యువ న్యాయవాదులకు చట్టాలపై శిక్షణ తరగతులు నిర్వహించి, న్యాయవాది వృత్తిలో న్యాయవాదులు రాణించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఐలు జనగామ జిల్లా కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ జిల్లా కన్వీనర్‌గా గాజుల రవీందర్, కో-కన్వీనర్‌లుగా మహేశ్వరం బద్రీనాథ్, గద్దల అమృత రావు, వట్టేపు వినయ్ కుమార్, అడ్వకేట్ ప్రింట్, ఎలక్ట్రానిక్ & సోషల్ మీడియా ఇంచార్జిగా బిట్ల గణేష్, కమిటీ సభ్యులుగా బాలబోయిన సంపత్, చాగంటి శ్రీనివాస్, గుగులోతు శ్రీనివాస్ నాయక్, బసుక ఠాగూర్ ప్రసాద్, దడిగే సందీప్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ఘనంగా డిప్యూటీ జైలర్ శెంకేసి వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ సెంట్రల్ జైలు, మామునూరు ప్రాంగణంలో డిప్యూటీ జైలర్‌గా పనిచేసిన శెంకేసి వెంకటేశ్వర్లు వివిధ హోదాలలో 40 సంవత్సరాల పాటు నిష్కళంకంగా, నిబద్ధతతో సేవలందించి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంపత్ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు నాలుగు దశాబ్దాల పాటు ఎటువంటి రిమార్కులు లేకుండా, నిజాయితీగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం జైలు శాఖకు గర్వకారణమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వర స్వామి, జైలర్లు కె.పూర్ణ చందర్, గోపిరెడ్డి, డిప్యూటీ జైలర్లు కె. శ్రీనివాస్, ఎం.సుధాకర్ రెడ్డి, ఇతర జైలు సిబ్బంది, అలాగే వెంకటేశ్వర్లు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల శాంతియుత దీక్ష

**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం శాంతియుత దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు (మాజీ జడ్పీటీసీ) ఎన్నం పెల్లి పాపన్న, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య, సీపీఎం జిల్లా నాయకులు అంకేశ్వరపు ఐలయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు అరికిల దేవయ్య, మాజీ వైస్ ఎంపీపీ వంగల నారాయణరెడ్డి, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దామర కొండ కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిన్నా ప్రతాప్ సేనా రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శాయంపేట మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు ఇమ్మడిశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పొడిశెట్టి గణేష్, ఉపాధ్యక్షులు గిద్దమారి సురేష్, పల్లెబోయిన సారయ్య, గిద్దమారి రామన్న పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్ మాట్లాడుతూ, ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఇనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేని పక్షాన ఈ ఉద్యమాన్ని ఉవ్వెత్తున కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఎండి రఫీ, రాజ్ మహమ్మద్,



మదర్ సాహెబ్, మండల కోశాధికారి కానుగుల నాగరాజు, మండల నాయకులు, మండల గౌరవ సభ్యులు నరసింహ రాములు, గంట శ్యాంసుందర్ రెడ్డి, తుమ్మ ప్రభాకర్, మేకల శ్రీనివాస్, మామునూరి రాజన్న, మారపల్లి సదానందం, అడప ప్రభాకర్, కోడెపాక బాబు, శాయంపేట టౌన్ ప్రెసిడెంట్ రంగు మహేందర్, జోగి రెడ్డి, దూదిపాల రాజిరెడ్డి, చిందం ప్రభాకర్, అరికెల్ల వీరయ్య, కర్రు ఆదిరెడ్డి, జాలిగపు అశోక్, ఎలమంచి సలేందర్ రెడ్డి, తుడుం వెంకటేష్, ఎర్ర తిరుపతిరెడ్డి, మనం దేవరాజు, నరహరిశెట్టి రామకృష్ణ, రాయరాకుల మొగిలి, బాసాని నవీన్, కోడిమల సంతోష్, ఓరుగంటి గోపాల్ రెడ్డి, పురాణం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ నిర్ధారణ శిబిరాలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఏఏఎం) పులుకుర్తి, ఊరుగొండ సబ్‌సెంటర్లలో యాక్టివ్ కేస్ ఫైండింగ్ (ఏసీఎఫ్) క్యాంపు, 'ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభినయ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్యాంపులో ఊరుగొండ సెంటర్ నుంచి 64, పులుకుర్తి సెంటర్ నుండి 21 – మొత్తం 85 స్పుటం (కళ్లె) శాంపిల్స్ ను సేకరించారు. వీటిని తదుపరి పరీక్షల నిమిత్తం జిల్లా క్షయ నివారణ కేంద్రం, హనుమకొండకు పంపించారు. అలాగే, క్షయ వ్యాధి అనుమానిత కేసులను – ఊరుగొండ నుండి 12 మందిని – 102 వెహికల్‌లో ప్రభుత్వ జాతీయ మరియు క్షయ దవాఖాన, హనుమకొండకు ఎక్స్-రే పరీక్ష కోసం పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాస్మిన్ మెహర, ఎస్‌టీఎస్ శ్రీనివాసు, ఎల్‌టీ జనార్ధన్, సూపర్వైజర్ శ్రీకాంత్, పద్మ, శోభారాణి (ఏఎన్‌ఎంలు) మరియు పులుకుర్తి, ఊరుగొండ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యాలయం వేదికగా విద్యార్థుల వీడ్కోలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** చిన్ననాటి నుంచి తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలు పదవీ విరమణ పొందడంతో బరువెక్కిన చిన్నారులు, విద్యార్థులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్కూల్ విద్య నుంచి ఆమె వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఉపాధ్యాయురాలికి జ్ఞాపిక అందజేసి వీడ్కోలు పలికారు. డోర్నకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న బత్తుల కృపాకాంత సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు గతంలో ఆమెతో కలిసి పనిచేసిన టీచర్లు కూడా ఈ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని వీడ్కోలు పలికారు. గడిచిన 36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అనేకమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన ఉపాధ్యాయురాలు కృపాకాంత అని కొనియాడారు. ఆమె శేష జీవితం ఆయురారోగ్యాలతో విరజిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంగోత్ లక్ష్మ నాయక్, ప్రధానోపాధ్యాయులు బండి నర్సింహా రావు, అప్పిరెడ్డి, శంకర్, శంకరయ్య, బిచ్చ నాయక్, శేషు కుమారి, అనిత, సమిత, మాలతి విద్యార్థులు సీతరామయ్య, గిరిధర్, చరణ్, తనిమ్, జాస్మిన్, బెనజీర్ తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో 2000-01 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సాదర స్వాగతం పలికి, చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్‌ఎం అంకతి జనార్ధన్ మాట్లాడుతూ అప్పటి విద్యాబోధనకు, ప్రస్తుత విద్యాబోధనకు మధ్య తేడాలను వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్, గణపతిశర్మ, రవీందర్, మధునయ్య, మల్లేశ్, కిషన్‌రావు, అలాగే పూర్వ విద్యార్థులు అశోక్, దేవరాజు, కృష్ణ, ఓంకార్, రాజేందర్, మోహన్, రవి, రత్నాకర్, సుమన్, శివరాం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలను కబలిస్తున్న అక్రమ మట్టి దందా

● డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి ఆందోళన



**వరంగల్ వాయిస్, దామెర :** మండల పరిధిలోని పలు గ్రామాల గుట్టల్లో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ మట్టి దందాను అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని పసరగొండ గ్రామ శివారులో గల గుట్టల్లో దిలీప్ రావు అనే వ్యక్తి క్రషర్ నిర్వహణ కోసం పర్మిషన్ తీసుకుని, ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా చేస్తున్న మట్టి దందాను అరికట్టి, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, సోమవారం హన్మకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవితో కలిసి, డీఆర్ఓ వై. నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దిలీప్ రావు అనే వ్యక్తి మండల పరిధిలోని పసరగొండ గ్రామ గుట్టల్లో, ప్రభుత్వం నుండి క్రషర్ నిర్వహణ కోసం అనుమతులు తీసుకొని ఒకవైపు క్రషర్‌ను నిర్వహిస్తూ, మరోవైపు ఎలాంటి అనుమతి లేకుండా, జేసీబీ సహాయంతో మొరం తవ్వుతూ, పెద్దపెద్ద లారీలలో నగరానికి తరలిస్తూ జోరుగా మట్టి దందాను చేస్తున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. అక్రమ మట్టి దందాతో కనుమరుగవుతున్న గుట్టలను మొరం దళారుల నుండి కాపాడాలని అధికారులను కోరారు. ఎలాంటి అనుమతులు లేకుండా స్వలాభం కోసం యథేచ్ఛగా మొరం దందాకు పాల్పడుతూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వ్యక్తులపై అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో పేరుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మట్టిని తరలిస్తున్నామని సాకులు చెబుతూ, ఇతర అవసరాలకు మట్టిని తరలిస్తున్నారని అన్నారు. సామాన్యులకు ఒక న్యాయం, దళారులకు మరో న్యాయమా? ఇదేంటని అడిగితే సమాధానం చెప్పలేని స్థితిలో పలు శాఖల అధికారులు ఉండటం ఎంతవరకు సమంజసం అని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంఘటన స్థలాన్ని పరిశీలించి అక్రమంగా మొరం తరలిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనిపక్షంలో పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాకు పాల్పడతామని హెచ్చరించారు.

# పరపతి సంఘాలతో అభివృద్ధి




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఆర్థికంగా వెనుకబడిన వారికి పరపతి సంఘాలు ఎంతో మేలు చేస్తాయని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పరపతి సంఘం చీఫ్ అడ్వైజర్ కొండ నరేందర్ గౌడ్ తెలిపారు. సోమవారం హనుమకొండలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పరపతి సంఘం 15వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ పరపతి సంఘాలు సభ్యుల వ్యక్తిగత నమ్మకంతో ఎటువంటి గ్యారెంటీ లేకుండా తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. రుణాలు తీసుకున్న వారు గడువు ప్రకారం చెల్లిస్తే పరపతి సంఘాలు ఆర్థికంగా మరింత బలపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. దాపు రెండున్నర కోట్ల రూపాయలతో సంఘాల కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పరపతి సంఘం అధ్యక్షుడు అంబాల సూర్యనారాయణ పెరుమాండ్ల మధుసూదన్, సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, సంఘం కోశాధికారి సత్యనారాయణ గౌడ్, సంఘాల ఫౌండర్ బత్తిని రమేష్ గౌడ్, కంకటి సాగర్, బూడిద ప్రభాకర్, కోల ప్రతాప్, మోడం రఘు, నాయుడు సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీని కలిసిన వరంగల్ ఏఎస్పీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ డివిజన్ నూతన ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శుభం ప్రకాష్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. నిరుపేద ప్రజలకు సత్వరమే న్యాయం అందించే రీతిలో క్రింది స్థాయి అధికారులపై పర్యవేక్షణ వుండాలని సీపీ నూతన ఏఎస్పీకి సూచించారు.

# క్రీడా పాఠశాలకు ఎంపికైన తనుశ్రీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని గూడూరు తనుశ్రీ రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు జరగనున్న ఎంపికకు హనుమకొండ జిల్లా స్థాయి నుండి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ తెలిపారు. వచ్చే నెల రెండవ తారీకు హైదరాబాదులోని హకీంపేట్ పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాల ఎంపికకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన గూడూరు తనుశ్రీ నీ మండల విద్యాశాఖ అధికారి కున్సోతు హనుమంతరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజు కుమార్, మేకల సత్యపాల్ అభినందించారు.

# పల్లెలను కబలిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు

● మామూళ్ల మత్తులో విద్యాశాఖ అధికారులు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖ నిబంధనలు పట్టించుకోకుండా, అనుమతి లేకుండా పాఠశాల నిర్వహణ చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ హరిత కాకతీయ గల్లీలో ఉన్న నారాయణ పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా చేస్తూ, పుస్తకాలు అమ్ముతున్నారని డీఈఓ, ఎంఈఓకి సమాచారం ఇచ్చినా పట్టించుకోకుండా ఉండటం విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారనడానికి ఇది నిదర్శనమని వారు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత గౌడ్, భాష బోయిన సంతోష్ లు మాట్లాడుతూ, నారాయణ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా మరియు హనుమకొండ జిల్లాలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, బుక్కులు, పెన్నులు, షూ, టై వంటివి అక్రమంగా అమ్ముతూ లాభార్జన ధ్యేయంగా నడిపిస్తున్నారని అన్నారు. జీవో 1, 10, 92, 42 లను ఉల్లంఘించి జిల్లాలో ఇష్టానుసారంగా ఫీజులు పెంచి, పెంచిన ఫీజులను నోటీస్ బోర్డులో పెట్టకుండా, స్మార్ట్ పేర్లను జోడిస్తూ, గ్రౌండ్, నిబంధనలకు అనుగుణంగా విశాలమైన తరగతి గదులు లేకుండా నడిపిస్తున్నారని, విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్, చిర్ర సాయి చందు, కొండ చరణ్, పెండ్యాల బన్నీ, శ్రీపతి రాంచరణ్, సాయి, తల్లా సిద్ధు, గండికోట సురేష్, బన్నీ, హర్ష, ఆదిత్య, రమేష్, శివారెడ్డి, సుకుమార్, రాజు, అచ్యుత్, అభిలాష్ లతోపాటు తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# పూరీ, ఛార్మితో కలసిపోయిన జెబిఎన్



టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో కోలీవుడ్ స్టార్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో ఓ సినిమా వస్తుంది. డబుల్ ఇస్మార్ట్ వంటి డిజాస్టర్ తర్వాత ఎలాగైనా హిట్ కొట్టాలని పట్టుదలగా ఉన్నాడు పూరి. ఈ నేపథ్యంలో సేతుపతితో సినిమా కోసం కథ చాలా పవర్ఫుల్ గా రెడీ చేశాడని టాక్ ఉంది. పూరి, విజయ్ సేతుపతి కాంబోలో మొదటి సినిమా కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ టబూ, కన్నడ స్టార్ దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ సేతుపతి సరసన సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తోంది. కాగా ఈ సినిమాను పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై ఛార్మి, పూరి జగన్నాథ్ సంయుక్తంగా నిర్మాణం చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ క్రేజీ ప్రాజెక్ట్ లో మరొక నిర్మాత వచ్చి చేరాడు. జేబీ మోషన్ పిచర్స్ అధినేత జెబి నారాయణ నిర్మాతగా పూరి సేతుపతి సినిమా కోసం పూరి కనెక్ట్స్ తో చేతులు కలిపారు. ఈ విషయాన్నీ అధికారికంగా ప్రకటించింది టీమ్. భారీ కాస్టింగ్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి విష్ణు రెడ్డి సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ లో బిజీగా ఉన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే స్టార్ట్ కానుంది. వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ సినిమాకు 'బెగ్గర్' తో పాటు 'భవతి బిక్షామ్ దేహి' అనే టైటిల్ కూడా పరిశీలనలో ఉన్నాయి.





# మళ్ళీ వస్తున్న రవితేజ మిరపకాయ్

### జూలై 11న రీ రిలీజ్

మాస్ మహారాజ రవితేజ మళ్లీ తన అభిమానులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీని అందించేందుకు రెడీ అయ్యాడు. రవితేజ నటించిన 'మిరపకాయ్' మూవీ గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించగా, ఈ సినిమాలో రవితేజ యాక్టింగ్‌కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇప్పుడు ఈ సినిమాను రీ–రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. జులై 11న 'మిరపకాయ్' చిత్రాన్ని రీ–రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. హనుమాన్ మీడియా ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు, ఈ సినిమాలో అందాల భామ రిచా గంగోపాధ్యాయ్, దీక్షా సేత్ హీరోయిన్లుగా నటించగా, రమేష్ పుప్పల ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశారు. థమన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. 'మిరపకాయ్' మూవీ రీ–రిలీజ్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమాలో హీరోయిన్స్‌తో పాటు ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది మరో క్యారెక్టర్.. రిచా గంగోపాధ్యాయ్ ఫ్రెండ్ పాత్రలో కనిపించిన స్నిగ్ధ. నటనా శైలితో పాటు తన ప్రత్యేకమైన వాయిస్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న స్నిగ్ధ, అప్పట్లో బాగా పాపులర్ అయ్యింది. తాజాగా 'మిరపకాయ్' రీ–రిస్ట్ ప్రకటన వెలువడిన నేపథ్యంలో, స్నిగ్ధ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'మాస్ రాజా రవితేజ కుమ్మేసిన బ్లాక్‌బస్టర్ 'మిరపకాయ్' మళ్లీ థియేటర్లలోకి వస్తోంది. తప్పకుండా చూడండి!' అంటూ ఆమె ఓ పోస్ట్ కూడా చేసింది. అయితే ఆమె పూర్తిగా గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.




# ఆల్కహాల్ తో అల్లరోడు..

టాలీవుడ్‌లో మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్స్‌లో అల్లరి నరేష్ కూడా ఒకరు. నటన పరంగా ప్రాణం పెట్టి ప్రేక్షకులకి మంచి వినోదం పంచేందుకు ఎంతో ప్రయత్నిస్తుంటారు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగలడు ఈ అల్లరోడు. ఒకప్పుడు కామెడీ సినిమాలే చేసిన అల్లరి నరేష్ ఇప్పుడు జానర్ మార్చి సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడు అల్లరి నరేష్ తన 63వ సినిమాతో బిజీగా ఉండగా, ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్‌లో నరేష్ ఆల్కహాలిజం లో మునిగి పోయినట్టుగా కనిపిస్తున్నారు. ఇది ఒక భ్రమ, వాస్తవికత మధ్య నడిచే కథ అని అర్థమవుతోంది. రుహాని శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివిధ భావోద్వేగాలతో నిండి ఉండే ఈ సినిమా, అల్లరి నరేష్‌కి మరో హిట్‌గా నిలవనుందని సినీ వర్గాలు ఆశిస్తున్నారు.ఇక ఈ రోజు అల్లరి నరేష్ బర్త్ డే కాగా, ఆయనకి సోషల్ మీడియాలో అభిమానుల నుండే కాక సినీ ప్రముఖుల నుండి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# ఈ సారి సిస్టర్స్ సెంటిమెంట్‌తో..

### తమ్ముడు చిత్రంపై దర్శకుడు శ్రీరామ్ వేణు

సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ 'తమ్ముడు'. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'తమ్ముడు' సినిమా జూలై 4న వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను డైరెక్టర్ శ్రీరామ్ వేణు వివరించారు. 'తమ్ముడు' సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు డిఫరెంట్ లేయర్స్ ఉంటాయి. ట్రైలర్ లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం. సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దు అనుకున్నాం. ఒప్పుకుంటే యు బై ఎ సర్టిఫికెట్ ఇచ్చేవాళ్లు. సినిమాలోని ఎస్సెన్స్ ను సరిగ్గా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలనే కట్స్ లేకుండా ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఇది మా అందరి ఉమ్మడి నిర్ణయం. దిల్ రాజు గారు ఒక్కరే ఈ డెసిషన్ తీసుకోలేదు. సినిమాలో అంతగా హింస లేదు. ఈ కథలో హీరోతో పాటు ఐదుగురు లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, దిత్య ముఖ్యమైన పాత్రలు చేశారు. హీరో అంటే ఇంత లెంగ్త్ ఉండాలి అనేది 'తమ్ముడు'లో ఉండదు. హీరోతో పాటు ఐదుగురు వుమెన్ క్యారెక్టర్స్ బలంగా ఉంటాయి. 'తమ్ముడు' కథ విని దిల్ రాజు గారు బ్జడెట్ గురించి ఆలోచించకుండా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. తమ్ముడు' ప్రమోషన్స్ లో అందరూ పాల్గొంటున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ బిజీ వల్ల నేను ఎక్కువగా పార్టిసిపేట్ చేయలేకపోతున్నా. ప్రమోషన్స్ కు డైరెక్టర్స్ లీడ్ తీసుకోవడం అనేది ఇప్పుడు ట్రెండ్ గా మారింది. మేమూ అదే ఫాలో అవుతున్నాం. ఒక గర్వం నిలబడటానికి జరిగిన యుద్ధమే తమ్ముడు మూవీ. బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ప్రధానంగా కథలో ఉన్నా అనేక లేయర్స్ తో మూవీ సాగుతుందని వివరించారు.





# పూర్వ విద్యార్థుల వజ్రోత్సవ సమావేశం

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల వజ్రోత్సవ సమావేశం అంగరంగ వైభవంగా జరిగింది. కంచనపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేధికగా జరిగిన ఈ వజ్రోత్సవ వేడుకలో పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంలో 40 మంది అల్యూమ్నీ తమ పాఠశాల జీవితాన్ని స్మరించుకున్నారు. గత రెండున్నర దశాబ్దాల్లో వారు సాధించిన విజయాలను పంచుకుంటూ, మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వేడుకల కార్యక్రమం సన్మానంతో ప్రారంభమై తమ అభివృద్ధికి అమూల్యమైన సేవలు అందించిన ప్రముఖులు, రిటైర్డ్ ఉపాధ్యాయుల ఘన సత్కారంతో ముగిసింది.



# బీరన్న జాతరకు రండి

## మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ రమేష్ కు ఆహ్వానం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా జూలై 6న నిర్వహించనున్న బీరన్న బోనాల జాతరకు రావాల్సిందిగా మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ బొల్లం రమేష్ ను ఆహ్వానించారు. బీరన్న ఆలయ కమిటీ సభ్యులు జింక రమేష్, కంచ మల్లయ్య, మండల నరసింహా రాములు, మండల పెద్ద రాంబాబు, చిగిరి పూర్ణచందర్, గొట్టె కుమార్ తదితరులు సోమవారం మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ బొల్లం రమేష్ ను కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు.



# నవశకానికి నాంది

- డిజిటల్ ప్రింట్ మీడియా ఎడిటర్స్ సంఘానికి శ్రీకారం
- సమస్యలపై సంఘటితంగా పోరాడుదాం అంటూ ప్రతిన
- అస్తిత్వాన్ని తొక్కాలని చూస్తే ఊరుకోం అంటూ హెచ్చరిక
- వరంగల్ కేంద్రంగా నూతన కమిటీ ఆవిర్భావం
- అధ్యక్షుడిగా గడ్డం కేశవ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్ రావు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** డిజిటల్ మీడియా అని చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదని, నేటి డిజిటల్ కాలంలో.. అన్ని పత్రికలు సోషల్ మీడియా ఫ్లాట్ ఫాంనే ఆశ్రయిస్తున్నాయని వరంగల్ డిజిటల్ ప్రింట్ మీడియా ఎడిటర్లు అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఓరుగల్లు డిజిటల్ మీడియా ఎడిటర్ల సమావేశం వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డిజిటల్ పేపర్లకు రాజకీయంగా, ప్రభుత్వ అధికారుల నుంచి రావాల్సిన గుర్తింపుపై చర్చించారు. మనం ఉన్నది ఆశించే స్థాయిలోకాదని, శాసించే స్థాయిలో ఉన్నామన్నారు. అన్ని పత్రికల్లా మనం కూడా ప్రభుత్వ, రాజకీయ, ప్రజల సమస్యలపై కథనాలు ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. రానున్న రోజుల్లో అన్ని పేపర్లు డిజిటల్ వైపే చూస్తాయని పేర్కొన్నారు.

### ఏకగ్రీవంగా కార్యవర్గం..

అనంతరం ఓరుగల్లు డిజిటల్ ప్రింట్ మీడియా ఎడిటర్స్ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సలహదారులుగా నేటిధాత్రి ఎడిటర్ కట్ట రాఘవేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ఆయుధం ప్రధాన సంపాదకులు వేముల నాగరాజును ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, ఉపాధ్యక్షులుగా స్పాట్ వాయిస్ ఎడిటర్ చేలిక రాజేంద్రప్రసాద్, అక్షరశక్తి ఎడిటర్ పల్లె రవివంశీమోహన్, ఘంటారావం ఎడిటర్ బొల్లెపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శిగా అక్షరదర్బార్ ఎడిటర్ వేముల రాజేశ్వర్ రావు, సహాయ కార్యదర్శులుగా జననిర్ణయం ఎడిటర్ దామెర రాజేందర్, మన కలం ఎడిటర్ సుంకరనేని నర్సయ్య, అక్షర సవాల్ ఎడిటర్ బాదవత్ బాలాజీ నాయక్, సంస్కృతిక కార్యదర్శిగా యామ్ స్పెన్ ఎడిటర్ యాంసాని శ్రీనివాస్, కోశాధికారిగా కౌడగాని మోహన్ రావు, మీడియా ఇంచార్జిగా స్పాట్ వాయిస్ నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా రావుల రాజేశం, గుడిమల్ల రామారావు, లింగబత్తిని కృష్ణ, సంపతి ప్రభాకర్ రావు, దాసరి మధు సూదన్, వక్కల వెంకటస్వామి, చల్లా రాజిరెడ్డి, కోల జనార్దన్, కె.కిరణ్, పెంచాల రాజును ఎన్నుకున్నారు.







# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలుసుకొన్నాం.. చదువులమ్మ తల్లి నీడలో అంటూ.. 33 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్క దగ్గర కలుసుకొన్నారు. 1992 వ సంవత్సరంలో పదో తరగతిని అరవింద విద్యాలయంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ పూర్వ విద్యార్థులు చిన్న నాటి స్కూల్ డ్రెస్ లతో 50 మంది పాల్గొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని, ఉత్సాహంగా నృత్యాలు చేసి ఉల్లాసంగా గడిపారు. ఉద్యోగ, వ్యాపారరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడి ఇతరదేశాల నుంచి ఐర్లాండ్, లండన్, అమెరికా, బహ్రెయిన్ నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు గుర్తు చేసుకొని ఆలింగనం చేసుకున్నారు. తన్మయత్వంలో మునిగి తేలి భావోద్వేగబరితంగా గడిపి తమ గత స్నేహాన్ని, ఆత్మీయతను చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు ఆటపాటలు అందరినీ అలరించాయి. పాఠశాలలో విద్యాబోధన చేసిన ఆ నాటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులు.. చంద్ర దేవ్, కుమార స్వామి, సలీం, కుమార్ నాగేశ్వర్ రావు, శ్రీరామరావు, ఫజల్, లక్ష్మి నారాయణ, మహ్మద్, వీరాస్వామిని ఘనంగా సత్కరించారు. ఇతర దేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులతో పాటు ఇతర ప్రాంతాలలో సెటిల్ అయిన.. ఓం ప్రకాష్, ప్రమోద్, కటికరెడ్డి ఆదిత్య, మీనా, దర్మేందర్, రాజు, శివరాం, శ్రీను, నవీన్, జంగా, ఉష శ్రీ, కృష్ణవేణి, స్వామి, నిరంజన్, సౌజన్యలు పాల్గొన్నారు.

# కేంద్రంపై ఒత్తిడి తెద్దాం

- కోచ్ ఫ్యాక్టరీని సాధించుకుందాం..
- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, నిర్మాణ పనుల్లో వేగం పెరిగేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేచ్చేలా పార్టీ పరంగా పోరాడాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం భాస్కర్ పిలుపునిచ్చారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హైదరాబాద్ నివాసంలో సోమవారం బీఆర్ఎస్ నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఓరుగల్లు ప్రజల 40 ఏళ్ల కలను సాకారం చేసేందుకు కృషి చేద్దామని అన్నారు. స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు దక్కాల్సిన విభజన చట్ట హామీల సాధనకై కలిసి ఉద్యమిద్దామని సూచించారు.



# సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- పదవీ విరమణ చేసిన సిబ్బందికి సూచన

**వరంగల్ వాయిస్, క్రైం :** పదవీ విరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఇదే సమయంలో సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సుధీర్ఘ కాలం పని చేసి పదవీవిరమణ పొందుతున్న సిబ్బందిని సీపీ సోమవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్సైలు విద్యాసాగర్, గాలిబ్, సూర్యనారాయణ, పిలిప్ రాజు, యాకుబ్, ఏఎస్సైలు గౌస్ పాషా, నాగేందర్ సింగ్, సంపత్, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీ సేవలు నేటి తరం పోలీసులకు అదర్శంగా నిలుస్తుందన్నారు. నేటి ఈ ప్రశాంత వాతావరణానికి మీ సేవలే కారణమన్నారు. మీరు అందించిన సేవలను మరువలేమన్నారు. ఈ కార్యక్రమములో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com